క్లుప్తంగా

కోడిగుడ్లతో మన్నెంపల్లి మాజీ ఉపసర్పంచ్‌పై దాడి



పోలీస్ స్టేషన్లో మాజీఉపసర్పంచ్ అనిల్‌గౌడ్, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపెల్లి మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్‌పై గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కోడిగుడ్లతో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అనిల్‌గౌడ్, స్థానికులు తెలిపిన వివరాలు.. నల్లగొండ నరసింహస్వామి దర్శనం చేసుకొని సాయంత్రం ఏడు గంటలకు అనిల్‌గౌడ్ గ్రామానికి చేరుకున్నాడు. బస్టాండ్ చౌరస్తా సమీపంలోకి రాగానే గ్రామానికి చెందిన తూముల శ్రీనివాస్ కోడి గుడ్డు కొట్టి హోలీ శుభాకాంక్షలు తెలిపాడు. అక్కడే ఉన్న మరికొందరు యువకులు పార్నంది జగదీశ్, నరేశ్ సైతం కోడిగుడ్లతో కొట్టారు. మీరెందుకు కొట్టారని అనిల్ ఖండించగా వాగ్వాదం చోటు చేసుకుంది. మాటమాట పెరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మరిన్ని కోడిగుడ్లతో తనపై దాడి చేశారని ఎల్‌ఎండీ ఎస్‌ఐ చేరాలకు అనిల్‌గౌడ్ ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. అనంతరం దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరగా విచారణ చేపడతామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరిపై దాడి చేసిన వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని నాగంపేట గ్రామంలోని ఓ వైన్స్ వద్దకు గండ్రపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం కొనుగోలుకు వెళ్లగా ఆదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి బీరు బాటిల్‌తో దాడి చేశాడు. విలాసాగర్ గ్రామానికి చెందిన వ్యక్తిని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పాత కేసు మనుస్సులో పెట్టుకొని దుషించాడు. ఎందుకు తిడుతున్నావని అడగ్గా బీరు సీసాతో దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎలగందుల శివారులో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తపల్లి: మండలంలోని ఎలగందుల శివారులో సోమవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. దాన్ని సీజ్ చేసి, యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



సైదాపూర్: ఎగ్లాస్‌పూర్ వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో భక్తులు



మహా కుంభాభిషేకం చేస్తున్న భారతీతీర్థస్వామి



శికరం వద్దకు కలశాలు తీసుకువస్తున్న స్వాములు, భక్తులు, వెంట ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని ద్వితీయ పుష్కర మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీజగద్గురు పుష్పగిరి పీఠాధిపతి దివ్యశంకర భారతీతీర్థస్వామి చేతుల మీదుగా వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ శిఖరంపై మహా కుంభాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు వెంకటేశ్వరశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఉత్తర నక్షత్రం శ్రీ అయ్యప్పస్వామి జన్మదినోత్సవం సందర్భంగా మంగళ వాయిద్యాలతో గోపూజ, మంగళ స్నానం, నిత్యపూజ, ఆదివాస వాహనం, దయాధివాహనం, జయాధివాహనం తదితర కార్యక్రమాలు చేపట్టారు. విద్యాశంకర భారతి తీర్థస్వామి భక్తులకు అయ్యప్పస్వామి దీక్ష విశిష్టత, సకల దేవతల పట్ల ఉండాల్సిన నియమనిష్ఠలను వివరించారు. మహోత్సవాలకు పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. మహా కుంభాభిషేకానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిమల్ల జయేందర్, సభ్యులు మామిడాల మనోహర్, ఎ.రాజేంద్రప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, వీర్రాజు, అనుమాస రాజేందర్, శ్రీధర్, శివ, భక్తులు పాల్గొన్నారు.

ఎగ్లాస్‌పూర్‌లో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

సైదాపూర్: మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు అనంతరం ఆలయంలో పూర్ణాహుతి హోమం, చక్రస్నానం పూజారులతో సాయంత్రం బ్రహ్మోత్సవాలు పూర్తి చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాలు అందజేత

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే స్వామివారి కల్యాణానికి గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు ఆదివారం పట్టువస్త్రాలు, సారె, ఒడిబియ్యం సమర్పించారు. సంఘం భవనం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకువచ్చారు. బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, సంఘం అధ్యక్షుడు కొలిపాక మల్లయ్య, నా యకులు సిరిపురం సత్యనారాయణ, మోర భద్రేశం, కొలిపాక మల్లేశం, మచ్చ లచ్చయ్య, నాగరాజు, అంజయ్య, కొలిపాక కమలాకర్, దే వాలయం కమిటీ చైర్మన్ నార్ల రమేశ్, సభ్యులు దోనపాటి సీతారాంరెడ్డి, కాసారపు బుచ్చిరాములు, మల్లేశం, రామస్వామి, రాజిరెడ్డి పాల్గొన్నారు.



రామడుగు: పట్టువస్త్రాలు, సారె, ఒడిబియ్యం తీసుకెళ్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

మరమ్మతులకు పరుగులు

- అధికలోడ్‌తో కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- చేతికందే దశలో వరిపంట
- ఆందోళనలో అన్నదాతలు

శంకరపట్నం: మండలంలో వరిసాగు విస్తీర్ణం పెరగటంతో వ్యవసాయబావులతో పాటు ఎస్సారెస్పీ కాలువలపై ఆధారపడి రైతులు విద్యుత్ మోటర్లను ఎక్కువగా వినియోగిస్తుండటంతో అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు ఎగువప్రాంతం కరీంపేట, ఇప్పలపల్లి, గ్రామాల్లో రైతులు ప్రధాన కాలువకు వ్యవసాయ మోటర్లు బిగించి పంట పొలాలకు పైప్‌లైన్ ద్వారా సాగునీటిని పొలాలకు మళ్లించి పంటలు సాగుచేసుకుంటున్నారు. మండలంలోని మిగతా 22 గ్రామాలలో ఆయకట్టు కాలువ కింద వ్యవసాయభూములున్నాయి. యాసంగిలో సుమారు 20వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట పొట్ట దశకు చేరుకోవడంతో సాగునీటి అవసరం అధికమైంది. ఒకేసారి వ్యవసాయబావులకు ఉన్న విద్యుత్ మోటార్లు వినియోగించడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడి కాలిపోతున్నాయి. ఇటీవల కరీంపేటలో వ్యవసాయ మోటార్లు కూడా కాలిపోతుండటంతో ఆర్థిక భారం పడుతుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఓల్టేజీ సమస్యను తీర్చి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరుతున్నారు. ఈవిషయమై విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే మరమ్మత్తులు చేపిస్తున్నాం. ఒకేసారి మోటర్లు ఆన్ చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతోంది. రైతుల పంట పొలాలను కాపాడేందుకు తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తున్నామని ఏఈ, సంపత్‌రెడ్డి తెలిపారు. మరోవైపు వ్యవసాయ మోటాట్లు సైతం కాలిపోతున్నాయని. మరమ్మతులకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతు సంపత్ రెడ్డి వాపోయాడు.



మరమ్మతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న రైతులు



డంపింగ్‌యార్డులా ఇరుకుల్ల వాగు

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల వాగులో వ్యర్థ పదార్థాలను, చెత్తాచెదారం, కవర్లు పడేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. సమీపంలోని ఓ గోదాం యజమాని మామిడి కాయలకు రసాయన పదార్థాలు వినియోగిస్తున్నాడు. రసాయన పదార్థాల ప్యాకెట్ల కవర్లను పెద్ద మొత్తంలో వాగులో పడేస్తున్నాడు. స్థానికులు సైతం చెత్తతో నింపేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో సోమవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు, యువత, మహిళలు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో కాముడి దహనం నిర్వహించారు. పాఠశాలలతో పాటు కాలేజీల్లో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. చొప్పదండి పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో విశ్వహిందు పరిషత్ నాయకులు హోలీ జరుపుకున్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో హోలీ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దూడపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల విధులకు హాజరైన జవానులతో హోలీ జరుపుకున్నారు. జాతీయ పతాకం రంగులను జావానులపై చల్లి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.



హుజూరాబాద్: హోలీ వేడుకల్లో కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు



రామడుగు: సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు



చొప్పదండి: విశ్వహిందూ పరిషత్ నాయకులు..



హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలో కాముడి దహనం



జమ్మికుంట: వాకర్స్ అసోసియేషన్ సభ్యులు...



జమ్మికుంట: చేయూత ఫౌండేషన్ సభ్యులు, జవాన్లు



ఇల్లందకుంట: ఎంపీపీ సరిగొమ్ముల పావని



గన్నేరువరంలో నాయకులు, యువకులు..



శంకరపట్నం: కేశవపట్నంలో హోలీ వేడుకలు



మానకొండూర్: రంగులు చల్లుకుంటున్న యువకులు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



కొత్తపల్లి: స్థానిక చిన్నగుట్ట వేంకటేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజు సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర, హనుమాన్ దేవాలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 27 వరకు వేడుకలు జరగనున్నాయి. చిన జీయర్ స్వామి, అహోబిల రామానుజ జీయర్ స్వామి, దేవనాథ రామానుజ జీయర్ స్వామి, ఇస్కాన్ ఆచార్యుడు నరహరిదాసు బుధవారం ఈ ఉత్సవాలకు హాజరుకానున్నారని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ ఎస్.నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.జనార్దన్ రెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, డా.ఎల్.రాంరెడ్డి, బోగ సుదర్శన్, బండ కిషన్‌రెడ్డి, నరహరి జగ్గారెడ్డి, డా.ఎల్.రాజభాస్కర్‌రెడ్డి, యువి రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

దుర్గాభవాని అమ్మవారికి పూజలు



విద్యానగర్: పౌర్ణమి సందర్భంగా సోమవారం కరీంనగర్ మండలంలోని నగునూర్ దుర్గాభవాని దేవాలయంలో అమ్మవారికి వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీహోమం, అమ్మవారికి పల్లకి సేవ, సహస్ర దీపారాధన జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు పవన్‌కృష్ణ శర్మ ఉయ్యాల సేవ, విశేష హారతి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.